

భానుపురి

ఇది సూర్యాపేట వార్తల ఉషాకిరణం

సోమవారం 2 నవంబర్ 2026 | ఎడిటర్ :- బచ్చు పురుషోత్తం | పేజీలు :- 2



షటిల్ క్రీడాకారుల కోసం ఉచిత గుండె వైద్య శిబిరం





భానుపురి /సూర్యాపేట ప్రతినిధి

నిత్యం తమతో కలిసి షటిల్ ఆడుతూ, నవ్వుతూ, సరదాగా గడిపిన తోటి క్రీడాకారుడు వెలుగు కర్ణాకర్ ఇటీవల గుండె పోటుతో హఠాన్మరణం చెందడం సహచర క్రీడా కారులను తీవ్ర విషాదానికి గురి చేసింది. కళ్లముందే తిరిగిన ఆత్మీయ క్రీడాకారుడు ఇక లేడనే వార్త అందరినీ కలచివేసింది. ఇలాంటి విషాదకర పరిస్థితి మరే క్రీడాకారుడి కుటుంబం లోనూ చోటుచేసుకోకూడదనే మానవీయ ఆలోచనతో గాయత్రి నర్సింగ్‌హోమ్ నిర్వాహకులు డా. ఊర రామమూర్తి యాదవ్ ముందడుగు వేశారు. తోటి క్రీడాకారుల ఆరోగ్యమే తన ఆరోగ్యంగా భావిస్తూ, షటిల్ ఆడే ప్రతి ఒక్కరూ గుండె సంబంధిత సమస్యల పట్ల అప్రమత్తంగా ఉండాలనే ఉద్దేశంతో సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఆర్వీ ఆసుపత్రిలో ఉచిత గుండె వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరానికి షటిల్ క్రీడాకారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. డా. ఊర రామమూర్తి యాదవ్ ఆధ్వర్యంలో ప్రతి ఒక్కరికీ ఉచితంగా ఈసీజీ, 2డీ ఎకో పరీక్షలు నిర్వహించారు. గుండె వైద్య నిపుణులు డా. అలక ప్రేమ్ కుమార్ క్రీడాకారులను పరీక్షించి, వారి ఆరోగ్య పరిస్థితిపై తగిన సూచనలు, సల హాలు అందించారు. ఈ సందర్భంగా డా. ఊర. రామ మ్మూర్తి యాదవ్ మాట్లా డుతూ ఒక తోటి క్రీడా కారుడిని కోల్పోయిన బాధ నుంచి పుట్టిన ఈ ఆలోచన.. మరెంతో మంది క్రీడా కారుల ప్రాణాలకు భరోసా కల్పించే మంచి ప్రయత్నంగా నిలిచిందన్నారు. క్రీడలతో పాటు ఆరోగ్యంపై కూడా ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని, గుండె సంబంధిత పరీక్షలను నిర్లక్ష్యం చేయకూడదనే సందేశాన్ని ఈ శిబిరం అందించిందన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరానికి సహకరించిన ఆర్వీ హాస్పిటల్ నిర్వాహకులు డా.అలక ప్రేమ్ కుమార్‌కు డా.ఊర రామమ్మూర్తి యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. తోటి క్రీడాకారుడి జ్ఞాపకార్థం, ఇతరుల ప్రాణాల పట్ల బాధ్యతతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించిన డా. ఊర రామమూర్తి యాదవ్ ను పలువురు అభి.నందించారు. వారు చేస్తున్న సేవలను కొనియాడారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో జిల్లాకు మంచి పేరు తీసుకురావాలి





భానుపురి /సూర్యాపేట

గ్రామీణ ప్రాంతాల్లో కబడ్డీ క్రీడకు ఎనలేని ఆదరణ ఉందని మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సూర్యాపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యం లో జిల్లా సబ్‌జూనియర్ బాలుర కబడ్డీ సెలక్షన్స్‌ను నిర్వహించారు. ఈ ఎంపికలను కౌన్సిలర్ కొణతం రాజేష్ రెడ్డితో కలిసి ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభను కనబరిచి సూర్యాపేట జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాం క్షించారు. క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు. ఎంపికైన క్రీడాకారులు నవంబర్ 12 నుంచి 14 వరకు వికారాబాద్ లో జరిగే తెలంగాణ రాష్ట్ర సబ్ జూనియర్ కబడ్డీ టోర్నమెంటులో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులు క్రీడలతో పాటు విద్యలో రాణించాలని అన్నారు. క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు స్నేహభావం పెంపొందుతుందని అన్నారు.రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనే జిల్లా టీం కొరకు 25 మంది క్రీడాకారులను ప్రత్యేక క్యాంపుకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అల్లం ప్రభాకర్ రెడ్డి, నామా నరసింహారావు, చైర్మన్ సోమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, అసోసియేషన్ సభ్యులు ఎస్ కె.ఇమామ్,రవీందర్ రెడ్డి, రమేష్ బాబు, ఇంద్రారెడ్డి, కోటి, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవకురాలు కలకోట అనిత పుట్టిన రోజు వేడుకలు





భానుపురి /సూర్యాపేట కల్చరల్

ఆ కుటుంబం నిత్యం సమాజ సేవలోనే....భయంకర మైన కరోనా సమయంలో బిక్కు బిక్కు మంటూ ఇంట్లోనే ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని గడిపిన ఆ రోజుల్లో ప్రాణాలను సైతం లెక్క చేయక కరోనా బారిన కుటుంబ సభ్యుల ఇంటికి వెళ్ళి మూడు పూటలా సైతం కరోనాస్ బాధితులకు సేవలు అందిం చిన కలకోట లక్ష్మయ్య అనిత దంపతుల గురించి ఎంత చెప్పిన తక్కువే. తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ మహిళా విభాగం ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు, వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ డిస్టిక్ 3104 ఏ రీజియన్ సెక్రెటరీ కలకోట అనిత లక్ష్మణ్ జన్మదిన వేడుకలు సూర్యాపేట లోని సాయి నగర్ లో గల శ్రీ షిర్డీ సాయిబాబా దేవాలయంలో నిర్మించిన శ్రీ సాయి గోశాలలో గోమాతలకు ఆహారం అందించారు. అనం తరం మందిరం లో శ్రీ భానుపురి సేవాబృందం నిర్వా హకులు శ్రీ రంగం రాము, యమా సంతోష్ ఆధ్వర్యం లో ఫ్రూట్ కటింగ్ కార్యక్రమం నిర్వహించగా శ్రీ వాసవి సేవాసమితి సూర్యాపేట జిల్లా అధ్యక్షులు బచ్చు పురుషోత్తం తప్సి గాంధీ, బజ్జూరి శ్రీనివాసు, వెంపటి శబరినాథ్, తేరటపల్లి సతీష్, మంచాల శ్రీనివాసు, దేవరశెట్టి ఉమారాణి లు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్య క్రమంలో పెద్ద ఎత్తున ఆర్యవైశ్యులు పాల్గొన్నారు...

ఘనంగా సీతారామచంద్రస్వామి మాస కళ్యాణం



భానుపురి/సూర్యాపేట కల్చరల్

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బొడ్రాయి బజార్‌లోగల శ్రీ వేదాంత భజన మందిరంలో శ్రీ సీతారామచంద్రస్వామి పునర్వసు జన్మ నక్షత్ర సందర్భంగా ఆదివారం మాస కళ్యాణం ను దేవాలయ అర్చకులు దరూరి సింగరాచార్యులు, ధరూరి రాఘవ చార్యులు ఆధ్వర్యంలోఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి ఉత్సవ విగ్రహములకు పంచామృత అభిషేకం నిర్వహించారు. పట్టు వస్త్రాలు అలంకరింపజేసి, వివిధ రకాల పూలతో అలంకారం చేసి వివిధ రకాల పండ్లతో నైవేద్యం గా సమర్పించారు. శాస్త్రోక్తంగా మాంగల్య దారణతో కళ్యాణ తంతు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ వేదాంత భజన మందిరం కార్యదర్శి నకరికంటి రాజశేఖర్, కోశాధికారి సోమ అశోక్, భక్తులు సోమ సుమన్, ఓరుగంటి చంద్రశేఖర్, మందిరం మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మృతి చెందిన కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం



భానుపురి/సూర్యాపేట టౌన్

సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు దురాజుపల్లికి చెందిన ముదిరెడ్డి వెంకట్ రెడ్డి గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. వారి మృతితో కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని తెలుసుకున్న వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి స్పందించారు. వెంటనే కోహెన్స్ (సువెన్) ఫ్యాక్టరీ యాజమాన్యంతో మాట్లాడి మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలని కోరారు. దీంతో ఫ్యాక్టరీ యాజమాన్యం స్పందించి బాధిత కుటుంబానికి రూ. 10 వేల ఆర్థిక సహాయం అందించింది.కష్టకాలంలో తమ కుటుంబానికి అండగా నిలిచి ఆర్థిక సహాయం అందించేందుకు చొరవ చూపిన వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి గారికి సహకరించిన కోహెన్స్ ఫ్యాక్టరీ యాజమాన్యానికి కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఆపదలో ఉన్న కుటుంబానికి మానవతా దృక్పథంతో సహాయం అందించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో 5వ వార్డు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పఠాన్ నబీ ఖాన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కొత్తపల్లి వెంకన్న, సయ్యద్ జావిద్, కోహెన్స్ ఫ్యాక్టరీ యాజమాన్య ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ పోలీసుల సంక్షేమానికి ప్రత్యేక కార్యాలయం





భానుపురి/సూర్యాపేట టౌన్

పోలీస్ శాఖలో ఎన్నో ఏళ్లపాటు సేవలందించి పదవీ విరమణ పొందిన అధికారులు, సిబ్బంది సమాజంలో గౌరవప్రదమైన స్థానంలో ఉండాలని జిల్లా ఎస్పీ నరసింహ అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కుడకుడ కోమటికుంటకు వెళ్లే మార్గం లో రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్స్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయ భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపనచేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడు తూ పదవీ విరమణ పొందినప్పటికీ పోలీసుల మధ్య ఉన్న అనుబంధం ఎప్పటికీ కొనసా గాలని, ఒకరి కొకరు అండగా ఉంటూ సమస్యలను పరిష్కరించు కోవాలని ఆకాంక్షించారు. అసోసియేషన్ సభ్యుల సంక్షేమ కార్యక్రమాలకు తనవంతు సహకారం ఉంటుందని తెలిపారు.. విధి నిర్వహణలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ ప్రజలకు సేవలందించిన రిటైర్డ్ పోలీసుల సంక్షేమానికి వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్య క్రమంలో రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ వ్యవస్థాపకులు కృష్ణారెడ్డి, అధ్యక్షులు దామోదర్ రెడ్డి, కార్యదర్శి పి. పుల్లయ్య, వైస్ ప్రెసిడెంట్ శంకర్ గౌడ్, జిల్లా పోలీస్ వైస్ ప్రెసిడెంట్ శంకర్ నాయక్, జనరల్ సెక్రటరీ వై. కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



నాటక సమాజాల జిల్లా అధ్యక్షుడు గిలకత్తుల పుల్లయ్య మృతి.



భానుపురి/సూర్యాపేట టౌన్

నాటక సమాజాల సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు గిలకత్తుల పుల్లయ్య ఆదివారం సూర్యాపేట జనగాం క్రాస్‌రోడ్ లో ఉన్న ఆయన నివాసంలో సాయంత్రం అనా రోగ్యం తో మరణించాడు. ఈయన పౌరాణిక పద్య నాటకాలలో వివిధ నాటకాలలో అనేక పాత్రలు పోషించి. మంత్రులు ఉన్నతాధి కారులతో ప్రశంసలు పొందాడు. మహిళలను. పురుషులను. బాల బాలికలను. చాలామందిని కళా కారులుగా తయారు చేశారు. ఈయన అంతక్రియలు సూర్యాపేటలో నేడు ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు నాటక సమాజాల జిల్లా సంయుక్త కార్యదర్శి ధనియాకుల వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ అంత్యక్రియలో కవులు రచయితలు. కళాకారులు. పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చాడు.

జిల్లా బంజారా విభాగం అధ్యక్షుడిగా డుంగ్రోత్ శ్యామ్ నాయక్



భానుపురి/సూర్యాపేట

తెలంగాణ రక్షణ సేన పార్టీ సూర్యాపేట జిల్లా బంజారా విభాగం జిల్లా అధ్యక్షుడిగా డుంగ్రోత్ శ్యామ్ నాయక్ నియమితులయ్యారు.ఈ సందర్భంగా తనపై నమ్మకం ఉంచి బంజార విభాగం జిల్లా అధ్యక్షుడిగా నియమించిన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితమ్మ గారికి డుంగ్రోత్ శ్యామ్ నాయక్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే తన నియామకానికి సహకరించిన బంజారా విభాగం రాష్ట్ర అధ్యక్షులు కిషన్ నాయక్ , రాష్ట్ర నాయకులు ఇస్మాయిల్, జిల్లా అధ్యక్షులు దేవేందర్ రెడ్డి కి,హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, బంజారా ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

తెలంగాణలో సన్నబియ్యం గరిష్ట ధరలు ఫిక్స్



భానుపురి/

BPT, ఖచీవీ రకం సన్నబియ్యం కిలో రూ.66

తెలంగాణ సోనా, RNR రకం కిలో రూ.74

HMT, JSR రకం కిలో రూ.79

ఈ రేట్లకు అమ్మకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని మిల్లర్లు, ట్రేడర్లకు పౌరసరఫరాల శాఖ స్పష్టం

ఈ ధరలను అన్ని దుకాణాల్లో ప్రదర్శించాలని ఆదేశం

సిలికాన్ యుగంలో సిరా చుక్క చేసిన ఆత్మఘోష

భానుపురి/సూర్యాపేట

కృత్రిమ మేధస్సు ఆకాశాన కలల పతంగై ఎగురుతుంటే, కవి గుండెలో కరిగిన గాయం కావ్యగంగై పొంగుతుంటే, యంత్రం పదాల ముత్యాలను మాలగా అల్లుతుంటే, కవి కన్నీటి చుక్క కరుణా కావ్యమై జాలువారుతుంటే! సిలికాన్ సిరాతో శతకాలు సృష్టించవచ్చు, క్షణాల గర్భాన సహస్ర భావాలను ప్రసవింపజేయవచ్చు, అక్షరాల అంబరాన అద్భుతాల హారాలు కూర్చవచ్చు, అలసటెరుగని మేధతో సాహితీ సీమలు దాటవచ్చు! కానీ, కానీ... చెప్పవా యంత్రమా... తల్లి ఒడిలోని వెచ్చదనాన్ని ఏ కోడ్‌తో కొలవగలవు? అనాథ కన్నీటిలోని అనంత వేదనను ఏ అల్గారిథమ్‌తో చదవగలవు?

అమ్మ పిలుపులోని అమృతాన్ని అంకెల్లో బంధించగలవా? నాన్న చెమట చుక్కలోని జీవితాన్ని లెక్కల్లో నింపగలవా? విడిచిన చేయి మిగిల్చిన వెలితిని వెలుగుల్లో చూపగలవా? విరిగిన గుండె పలికే మౌనాన్ని వైర్ల గుండా వినిపించగలవా?

యంత్రానికి వేగం ఉంది మెరుపులా దూసుకుపోయే శక్తి, కవికి అనుభవం ఉంది యుగాలనూ కదిలించే యుక్తి; యంత్రానికి జ్ఞానం ఉంది సముద్రాలంత సమాచారం, కవికి హృదయం ఉంది --- కన్నీటినే మార్చే కావ్యధార!

అది గణనల గగనంలో గరుడగమనమై విహరిస్తే, ఇది గాయాల గర్భంలో గంగాజలమై ప్రవహిస్తుంది; అది అక్షరాల అద్దంలో అందాలను ఆవిష్కరిస్తే, ఇది అణగారిన ఆర్తుల ఆవేదనకు అక్షరాభిషేకం చేస్తుంది!

ఒకటి మెదడులో మెరిసే విద్యుద్దీపమైతే, మరొకటి చీకటి గుండెలో వెలిగే మట్టి దీపం; ఒకటి సమాచార సాగరాన ముత్యాలను ఏరితే, మరొకటి మానవత్వపు మడుగున మల్లెలను పూయిస్తుంది!

కలం అంటే కేవలం కదిలే కర్ర కాదు --- కన్నీటికి కంఠమిచ్చే కరుణా శంఖం! కవిత అంటే కేవలం పదాల పొందిక కాదు --- పరాయి గుండెలోనూ పరిమళించే ప్రేమపుష్పం!

అయినా యంత్రమా... నిన్ను నిరాకరించడం నా నైజం కాదు, నీ విజ్ఞానాన్ని వెలివేయడం నా కవిత్వ ధర్మం కాదు; నీ వేగానికి నా భావం జతకలిస్తే వసంతమే, నీ మేధకు నా మానవత్వం తోడైతే మహోదయమే!

నీవు రెక్కలివ్వు --- నా కలం విశ్వవీధుల్లో విహరించనీ, నీవు దారిచూపు --- నా భావం దివ్యదీపమై వెలగనీ; కానీ... నా కలానికి గుండె చప్పుడును దూరం చేయకు, నా అక్షరానికి ఆత్మీయతను ఎన్నడూ పరాయి చేయకు!

ఎందుకంటే...

యంత్రం పద్యాన్ని రాయవచ్చు --- ప్రాణాన్ని పోయగలదా? పదాల వర్షాన్ని కురిపించవచ్చు --- పరవశాన్ని నింపగలదా? కల్పనల కోటలను కట్టవచ్చు --- కన్నీటిని తుడవగలదా? భావాల బొమ్మలను గీయవచ్చు --- భగ్నహృదయాన్ని అతికించగలదా?

కాలం మారనీ... కలం కొత్త రెక్కలతో విహరించనీ, విజ్ఞానం పెరగనీ... విశ్వమంతా వెలుగులతో నిండిపోనీ; కానీ...అక్షరాల అరణ్యంలో ఆత్మీయత అంతరించకూడదు, సాంకేతిక శిఖరాలపై మానవత్వపు పతాకం అవనతం కాకూడదు!

సిరా చుక్కలో సముద్రమంత సత్యం దాగి ఉన్నంతకాలం, కవి గుండెలో కరుణాదీపం వెలిగి ఉన్నంతకాలం, యంత్రాల యుగంలోనూ కవిత్వం జీవించే ఉంటుంది, మనిషి మనసును తాకే అక్షరం మహాకావ్యమై నిలిచే ఉంటుంది!

యంత్రం అక్షరానికి రెక్కలివ్వగలదు... కానీ.. ఆ అక్షరం ఎగరాల్సిన ఆకాశం మాత్రం కవి హృదయమే!



కె . ఎస్ .అన్నపూర్ణాదేవి, తెలుగు అధ్యాపకురాలు, M.A ; M.Phil, (Ph.D) , SKR GDC(W) రాజమహేంద్రవరం

చీకటిని జయించి వెలుగులు నింపుతున్న శ్రీ నామాల వారాల వెంకటేశ్వర స్వామి

-250 ఏళ్ల నాటి పురాతన దేవస్థానానికి పూర్వ వైభవం తెచ్చే ప్రయత్నం

-భక్తుల విశ్వాసానికి నిలయంగా..అభివృద్ధికి నోచుకోని ఆలయంగా

భానుపురి/కేతపల్లి

నల్గొండ జిల్లా కేతపల్లి మండలం గుడివాడ గ్రామంలో ఉన్న పురాతన శ్రీ నామాల వారాల వెంకటేశ్వర స్వామి దేవస్థానం చరిత్ర, భక్తుల విశ్వాసం, ఆధ్యాత్మిక ప్రాధాన్యతను సంతరించుకున్న క్షేత్రంగా నిలుస్తోంది. సుమారు 250 ఏళ్ల క్రితం స్వయంభువుగా ఏడు నామాలతో ఒక బండపై ఉన్న పెద్ద రాతి గుండుపై శ్రీ వెంకటేశ్వరస్వామి వెలిశారని స్థానికులు, భక్తులు విశ్వసిస్తున్నారు. అందుకే ఈ స్వామివారిని అత్యంత పవిత్రంగా భావిస్తూ తరతరాలుగా భక్తులు దర్శించుకుంటున్నారు.

-ఏడు శనివారాల ప్రదక్షిణ..కోర్కెలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం

ఈ ఆలయానికి ఉన్న ప్రత్యేకతల్లో ఏడు శనివారాల ప్రదక్షిణ ఒకటి. స్వామివారిని దర్శించుకుని ఏడు శనివారాల పాటు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ మొక్కు చెల్లించుకోవడం ఇక్కడి భక్తుల ఆచారం.ఒక్కో ప్రదక్షిణకు ఒక్క రూపాయి సమర్పిస్తూ ఏడు వారాల పాటు ప్రదక్షిణలు చేసి, అనంతరం ఏడు దీపాలు వెలిగించి అష్టోత్తరనామ పూజ నిర్వహించుకుంటారని స్థానికులు చెబుతున్నారు. వివాహం కావాలని మొక్కుకున్న వారికి వివాహం జరుగుతుందని, సంతానం కోసం ప్రార్థించిన వారికి సంతానం కలుగుతుందని, ఆరోగ్యం కోసం మొక్కుకున్న వారికి ఆరోగ్యం చేకూరుతుందని భక్తుల్లో విశ్వాసం ఉంది.అయితే ఇవి భక్తుల విశ్వాసాలకు సంబంధించిన విషయాలుగా చూడాల్సి ఉంటుంది. ఈ నమ్మకాలే దూర ప్రాంతాల నుంచి కూడా భక్తులను ఈ క్షేత్రం వైపు ఆకర్షిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు.

-11 ఎకరాల ఆలయ ప్రాంగణం..దేవుడి పేరుతోనే భూములు

ఈ పురాతన దేవస్థానానికి సుమారు 11 ఎకరాల ఆలయ ప్రాంగణం ఉన్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. అంతేకాకుండా దేవుడి మాన్యంగా సుమారు 5.10 ఎకరాల భూమి ఉన్నట్లు, ఆ భూములకు సంబంధించిన రెవెన్యూ రికార్డుల్లో ఇప్పటికీ దేవస్థానం పేరే కొనసాగుతున్నట్లు



చెబుతున్నారు. ఇంతటి ఆలయ ఆస్తి చారిత్రక నేపథ్యం, భక్తుల విశ్వాసం ఉన్నప్పటికీ ఆలయం మాత్రం గత కొన్నేళ్లుగా సరైన అభివృద్ధికి నోచుకోకుండా ఉండటం ఆవేదన కలిగించే అంశంగా మారింది. దేవుడి పేరుతో భూములు ఉన్నప్పటికీ దేవస్థానం అభివృద్ధి చెందక పోవడంపై స్థానికులు, భక్తులు ప్రశ్నిస్తున్నారు.

-పాలకుల నిర్లక్ష్యం..భక్తుల ఆవేదన

ఇంతటి పురాతన ఆలయాన్ని అభివృద్ధి చేసి భక్తులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం ఉన్నప్పటికీ గతంలో పాలకుల నుంచి ఆశించిన స్థాయిలో చొరవ కనిపించలేదని స్థానికులు అంటున్నారు. ఆలయానికి ప్రహరీ గోడ, విద్యుత్, నిత్య పూజా కార్యక్రమాలు, భక్తులకు అవసరమైన వసతులు, స్వామివారి కల్యాణోత్సవాల నిర్వహణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరుతున్నారు. ఆలయానికి ఉన్న చారిత్రక ప్రాధాన్యతను కాపాడటంతో పాటు, అందుబాటులో ఉన్న దేవుడి మాన్య భూములు, ఆస్తుల విషయంలో కూడా పారదర్శకతతో కూడిన సంరక్షణ, నిర్వహణ అవసరమని భక్తులు అభిప్రాయపడుతున్నారు.

-పునరుద్ధరణకు ముందుకొచ్చిన దాతలు

ఆలయానికి పూర్వ వైభవం తీసుకురావాలన్న సంకల్పంతో ఇటీవల కొంతమంది దాతలు, గ్రామస్థులు ముందుకు వస్తున్నారు. ఆలయ పునరుద్ధరణ పనులను చేపట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆలయ పనులు పూర్తయిన అనంతరం భక్తుల ఆచారంగా కొనసాగుతున్న ఏడు శనివారాల ప్రదక్షిణలకు అనుమతి కల్పించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.ఈ ఆలయంలో నిత్య పూజలు, స్వామి వారి కళ్యాణోత్సవం, భక్తుల కోసం ప్రత్యేక కార్యక్రమాలు



నిర్వహించేలా ఒక శాశ్వత వ్యవస్థ ఏర్పాటు చేయాలన్న డిమాండ్ కూడా వినిపిస్తోంది.

-పూర్వ వైభవం కోసం ప్రజలంతా ఒక్కటవ్వాలి

పురాతన ఆలయాన్ని కేవలం ఒక దేవాలయంగా కాకుండా గ్రామ చారిత్రక,ఆధ్యాత్మిక వారసత్వంగా పరిరక్షించాల్సిన అవసరం ఉందని స్థానికులు చెబుతున్నారు. ఆలయ అభివృద్ధిపై గ్రామస్థులు, భక్తులు, దాతలు, అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి ఒక వేదిక ఏర్పాటు చేసుకుని చర్చించాలని సూచిస్తున్నారు. ఆలయ ప్రహరీ గోడ నిర్మాణం, ఆలయ పునరుద్ధరణ, నిత్య పూజల నిర్వహణ, స్వామివారి కళ్యాణోత్సవం, భక్తులకు మౌలిక వసతుల కల్పన, దేవస్థాన ఆస్తుల సంరక్షణ వంటి అంశాలపై సమగ్ర కార్యాచరణ రూపొందించాలని కోరుతున్నారు. ఇప్పటివరకు నిర్లక్ష్యానికి గురైన ఈ పురాతన క్షేత్రానికి మళ్లీ పూర్వ వైభవం తీసుకురావడానికి గ్రామస్థులు, భక్తులు, దాతలు కలిసికట్టుగా ముందుకు వస్తే శ్రీ నామాల వారాల వెంకటేశ్వర స్వామి దేవస్థానం మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంది. చరిత్రను కాపాడుతూ..భక్తి విశ్వాసాలను గౌరవిస్తూ.. భావితరాలకు ఈ పురాతన దేవస్థానాన్ని అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని గ్రామస్థులు అంటున్నారు.

పురాతన క్షేత్రాన్ని దర్శించండి..పునరుద్ధరణలో భాగస్వాములు కండి..శ్రీ నామాల వారాల వెంకటేశ్వర స్వామివారి పూర్వ వైభవానికి చేయూతనివ్వండి.